



ఎన్నికల ప్రచారానికి.. ఎండదెబ్బ!

- జిల్లాలో మండిపోతున్న ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న నేతలు
- అభ్యర్థుల వెంట పెద్దగా కనిపించని కార్యకర్తలు, జనం
- ఇంటింటా ప్రచారానికి ఆటంకం
- సమయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు నేతల పాట్లు
- జిల్లావ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న కొద్ది మరింత హీటెక్కుతున్న రాజకీయాలు

ఆదిలాబాద్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రారెత్తిస్తున్న ఎండలతో లోక్‌సభ ఎన్నికల ప్రచారంపై ఎండదెబ్బ ఎఫెక్ట్ స్పష్టంగా కనిపిస్తోంది. లోక్‌సభ పోలింగ్‌కు సమయం దగ్గర పడుతున్న కొద్ది రాజకీయాలు మరింత హీటెక్కుతున్నాయి. మండిపోతున్న ఎండలకు పార్టీ శ్రేణులు, జనాలు భయటకు వచ్చేందుకు జంకుతున్నారు. అసలే ఆలస్యంగా ప్రారంభమైన లోక్‌సభ ఎన్నికల ప్రచారం.. ఇప్పటి వరకు ఊపందుకున్నట్లే కనిపించడం లేదు. ఎండల ప్రభావంతో ప్రచారానికి సరిపడా సమయం దొరకడం లేదని అభ్యర్థులు వాపోతున్నారు. దీంతో సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తూ.. ఇంటింటా ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లోనే కొంత వరకు ప్రచారాన్ని చేపడుతున్న అభ్యర్థులు.. మధ్యాహ్నం సమయంలో పూర్తిగా విశ్రాంతి తీసుకుంటూ ముఖ్య కార్యకర్తలు, నేతలతో మంతనాలు జరుపుతున్నారు. చేసేది ఏమీ లేక కార్యకర్తల ఇళ్లలోనే కొంతసేపు సేద తీరుతున్నారు. సభలు, సమావేశాల కోసం జనాన్ని సమీకరించేందుకు నేతలు పడరాని పాట్లు పడుతున్నారు. ఒకవేళ పార్టీ అభ్యర్థి ప్రచారానికి హాజరవుతున్న కొద్దిసేపటికే ఎండ తాపానికి తట్టుకోలేక కార్యకర్తలు తిరిగి ఇంటిముఖం పడుతున్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఎండదెబ్బతో అస్వస్థతకు గురికావడంతో గత రెండు రోజులుగా ప్రచారానికి దూరంగా ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నారు.

జిల్లాలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు

రాష్ట్రంలోనే అత్యధికంగా 40డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదవుతున్నాయి. ఎన్నికల ప్రచారంతో రాజకీయాలను మరింత హీటిక్కించేందుకు నేతలు ప్రయత్నాలు చేస్తున్న ఎండల తీవ్రతతో ప్రచార సందడి కనిపించడం లేదు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజక వర్గాల్లో ఇప్పటి వరకు అభ్యర్థులెవరు పూర్తి స్థాయిలో ప్రచారం చేపట్టిన పరిస్థితులు కనిపించడం లేదు. ప్రస్తుతం పోలింగ్‌కు సమయం దగ్గర పడడంతో అభ్యర్థుల్లో కొంత ఆందోళన కనిపిస్తోంది. సమయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు అభ్యర్థులంతా పడరాని పాట్లు పడుతున్నారు.

నేతల ఉక్కిరిబిక్కిరి

పెరిగిపోతున్న ఎండల తీవ్రతకు నేతలు ఉక్కిరిబిక్కిరై పోతున్నారు. ప్రస్తుతం జిల్లాలో 40 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 6 గంటల నుంచే నేతలు ప్రచారబాట పడుతున్నారు. ఉదయం 9 గంటలకే సూర్యుడు సుర్రుమనిపించడంతో చెట్ల నీడను ఆశ్రయిస్తున్నారు. కష్టమైన మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రచారాన్ని కొనసాగిస్తున్నా.. ఆ తర్వాత తిరిగే పరిస్థితులు లేకపోవడంతో ప్రచారాన్ని నిలిపి వేస్తున్నారు. ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ఉల్లిగడ్డ, మజ్జిగ, శీతల పానీయాలను తరుచు తీసుకుంటున్న ప్రయోజనం లేదంటున్నారు. సాయంత్రం నాలుగైదు గంటల నుంచి రాత్రి 10 వరకు ఎక్కువగా.. ప్రచారం చేసేలా ప్లాన్ చేసుకుంటున్నారు. మధ్యాహ్నం సమయంలో చెట్ల నీడ, ప్రత్యేక టెంట్ల కింద కార్యకర్తలతో కలిసి సమావేశాలను నిర్వహించుకుంటున్నారు. సమావేశాల సమయంలో కరెంట్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ కొద్దిసేపు కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడి తీవ్రమైన ఉక్కపోతలతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.




కనిపించని సందడి

పట్టణ, మండల కేంద్రాలలో అడప దడపగ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న గ్రామాల్లో మాత్రం ప్రచార సందడి కనిపించడం లేదు. అడపాదడప ప్రచార రథాలు వస్తూపోతున్న.. నేతల పర్యటనలు మాత్రం కనిపించడం లేదని గ్రామీణ ప్రాంతాల ప్రజలు అంటున్నారు. ఎండ తీవ్రతకు సభలు, సమావేశాలు, ర్యాలీలకు మహిళలు, వృద్ధులను తరలించేందుకు వెనుకాడుతున్నారు. ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తితే ఇబ్బందులు ఎందుకన్న భావన కనిపిస్తోంది. గ్రామాల్లో ఉపాధి పనులు ఊపందుకోవడంతో పని ప్రదేశాల్లోనే నేతలు ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఉపాధి కూలీల వద్దకు వెళ్లి తమకు మద్దతుగా నిలవాలని కోరుతున్నారు. ఉదయమే ఉపాధి కూలీలు, రైతులు పనులకు వెళ్లడంతో గ్రామాల్లో జనాలు ఎవరూ కనిపించడం లేదు. దీంతో అభ్యర్థులు వారి వద్దకే వెళ్లి ప్రచారాన్ని చేపడుతున్నారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో ఏ పార్టీ అభ్యర్థి ఎవరో తెలియని పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఇంటింటా ప్రచారానికి దూరం

అభ్యర్థులు ఇంటింటా ప్రచారానికి అంతా ప్రాధాన్యత ఇచ్చిన్నట్లు కనిపించడం లేదు. ఎండల తీవ్రతకు ఇంటింటా ప్రచారం చేయడం కొంత కష్టంగానే కనిపిస్తోంది. దీంతో గ్రామాల ప్రధాన కూడళ్లలో జన సమీకరణ చేసి ప్రచారాన్ని చేపడుతున్నారు. ఇలా నిత్యం 5నుంచి 10 గ్రామాల వరకు ప్రచారాన్ని చుట్టేస్తున్నారు. ప్రచార రథాలతో గ్రామాల్లో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ప్రచారంలో అభ్యర్థుల వెంట ఉదయం కనిపించిన కార్యకర్తలు, నేతలు.. మధ్యాహ్న సమయం వరకు పూర్తిగా పలుచబడిపోతున్నారు. మండల, నియోజకవర్గ స్థాయి ముఖ్యనేతలు అభ్యర్థుల వెంట ప్రచారంలో పాల్గొంటున్న కొన్ని గ్రామాల్లో కారుదిగి కాలు కింద పెట్టిన దాఖలాలు కనిపించడం లేదు. తీవ్రమైన ఎండలకు కారు దిగేందుకే జంకుతున్నారు. ఒకవేళ ప్రచారానికి వెళ్లిన మధ్యాహ్నం వరకే ముగించుకుని ఇంటికి తిరుగుముఖం పడుతున్నారు. సాయంత్రం 5 గంటల వరకు విశ్రాంతి తీసుకుంటూ.. ఆ తర్వాత ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ప్రయత్నం చేస్తున్నారు.





చెట్టు నీడలో సేదతీరుతున్న గొర్రెల మంద

సుర్రుమంటున్న సూర్యుడు!

- బేలలో 44.0 డిగ్రీల అత్యధిక పగటి ఉష్ణోగ్రత నమోదు



స్కార్ఫ్ ధరించి వెళ్తున్న యువతి

ఆదిలాబాద్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచే సూర్యుడు సుర్రుమనడంతో పగటి ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి పోతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బేల మండలంలో అత్యధికంగా 44.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వేసవి సీజన్‌లో ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇదే మొదటిసారి. జైనథ్ మండలంలో 43.7, మావలలో 42.8, ఇంద్రవెల్లిలో 41.8, బజార్‌హత్నూర్‌లో 40.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదుకాగా బోథ్ మండలం సోనాలలో 40.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దాదాపుగా జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో 40డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 42.3 కాగా కనిష్ఠంగా 26.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పగలంతా తీవ్రమైన వడగాలులతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎండల తీవ్రతకు నీటిజాడలు అడుగంటుక పోవడంతో మూగజీవాలు దాహంతో అల్లాడుతున్నాయి. మధ్యాహ్న సమయంలో చెట్ల నీడలోనే సేదతీరుతున్నాయి. పశుగ్రాసం కొరత కూడా తీవ్రంగా ఏర్పడుతుంది. పలు మారుమూల గ్రామాలలో తాగునీటి ఎద్దడి తలెత్తడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో శేఖర్

ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు

తలమడుగు, ఏప్రిల్ 27: మండలంలో రోజురోజుకు ఎండల తీవ్రత పెరిగి పోవడంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు ఎండదెబ్బ తగలకుండా వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఎంపీడీవో శేఖర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పనులకు వస్తున్న కూలీలు ఉదయం పూటనే పనులు ముగించుకోవాలని సూచించారు. అదేవిధంగా కూలీలకు మౌలిక వసతులు కల్పించాలని స్థానిక సిబ్బందికి సూచించారు. అంతేకాకుండా ఉపాధి హామీ పనులు ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా ప్రతీరోజు మాస్టర్స్ పరిశీలించి వివరాలు తెలియజేయాలని పేర్కొన్నారు. ఇందులో ఎంపీవో వినోద్‌కుమార్, ఏపీవో మేఘమాల, పంచాయతీ సెక్రటరీ, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఎండ వేడిమి తాళలేక పడిపోయిన వృద్ధురాలు

ఎండకు స్పృహ కోల్పోతున్న వృద్ధులు!

తాంసి, ఏప్రిల్ 27: గత మూడు రోజుల నుంచి ఎండల తీవ్రత మరింత పెరిగింది. ఉదయం 7.30 గంటల నుంచే ఎండ తీవ్రత ప్రారంభమై సాయంత్రం ఏడు గంటల వరకు నిప్పుల కొలిమెలా కనిపిస్తుంది. దీంతో నిరుపేదలైన వృద్ధుల పరిస్థితి దయనీయంగా మారింది. ఇంట్లో ఉందామంటే ఫ్యాన్లు లేక.. బయటకు వెళదామంటే ఎండ తీవ్రతతో అల్లాడుతున్నారు. బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. శనివారం ఒక వృద్ధురాలు స్పృహ కోల్పోయి రోడ్డు పక్కన పడిపోవడం పలువురిని కలిచివేసింది. ఎండల నుంచి ఉపశమనం కలిగించడానికి వైద్యులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని మండల వాసులు వాపోతున్నారు. కనీసం ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూడా పంపిణీ చేయడం లేదని వాపోతున్నారు. ఈ పాటికే అనేక గ్రామాలలో వడదెబ్బ తగిలి ఎందరో మంచం పట్టిన సంఘటనలు ఉన్నాయి. నేటికీ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారు కూడా లేకపోలేదు. ఉపాధి పనులకు వెళ్లేందుకు కూడా కూలీలు భయపడుతున్నారు. ఉపాధి పనులకు వెళుతున్న వారికి కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదన్న ఆరోపణలు కూడా సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఎండల తీవ్రత పెరగడంతో రానున్న మే నెలలో ఎండలు మరి ఎలా ఉంటాయోనని జనం భయపడుతున్నారు.

దేశానికి యువత వెన్నెముక : ఎమ్మెల్యే

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 27: దేశానికి యువత వెన్నెముక లాంటిదని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో యువ సమ్మేళనం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధికంగా యువకులు ఉన్న దేశం భారతదేశం అని, యువత గెలుపోటములను శాశించే స్థాయికి ఎదిగిందని తెలిపారు. బీజేపీలోనే యువతరం అత్యధికంగా ఉందని, నేడు ప్రపంచ దేశాలకు మార్గదర్శనం చేసే స్థాయికి దేశాన్ని మోదీ తీసుక వెళ్లారన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేవైఎం నాయకులు, రాష్ట్ర నాయకులు సురేష్‌గౌడ్, బ్రహ్మానంద్, నగేష్, మయూర్‌చంద్ర, పాయల్ శరత్, వెంకటేశ్, సుచిత్, అశోక్, ముస్తాఫూర్, రఘుపతి, కృష్ణయాదవ్, హేతేంద్రనాథ్ యాదవ, కార్యకర్తలు పాల్గొన్నారు.



మార్కెట్ యార్డులో ఆందోళన చేస్తున్న రైతులు, బీజేపీ నాయకులు

జొన్నలను కొనుగోలు చేయాలి

- ఓబీసీ జిల్లా అధ్యక్షుడు

బోథ్, ఏప్రిల్ 27: రైతులు పండించిన జొన్న పంటను ప్రభుత్వం ఎకరానికి 20 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రాజు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బోథ్‌లోని మార్కెట్ యార్డులో రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన జొన్నల కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం రాజుయాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతుల వద్ద ఎకరానికి 13 క్వింటాళ్ల మేరకు కొనుగోలు చేయడం జరిగిందని, అయితే ప్రస్తుతం కేవలం 8క్వింటాళ్ల 85 కిలోలు కొనుగోలు చేస్తామని పేర్కొనడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ ఏడాది ఎకరానికి 20 క్వింటాళ్ల మేరకు దిగుబడి వచ్చిందని, రైతులు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతే కాకుండా ఈ విషయంలో సంబంధత అధికారులు పునరాలోచించి రైతులకు తగిన న్యాయం చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. బోథ్ పరిధిలోని ఆయా గ్రామాలలో పలువురు రైతులు జొన్న పంటను సాగు చేశారని, ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని, రైతులు పం డించిన జొన్న పంటను 20 క్వింటాళ్ల వరకు ప్రభుత్వమే కొనుగోలు చేయా లని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అనీల్ అప్ప, సంజీవ్, కనుగుట్ట గ్రామ రైతులు భీమ్‌రావు, సోనాల రైతు రవీందర్‌రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, బీజేపీ నాయకులు జీవీ రమణ పాల్గొని ప్రసంగించారు. ఇందులో మండల కన్వీనర్ బోరే రవీందర్, పార్టీ సీనియర్ నాయకులు సుభాష్, సూర్య, ఆశ్రమ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాత్రంతా డంపింగ్.. పగలంతా తరలింపు

- ఇసుక అక్రమ దందాకు అడ్డాగా సమీకృత మార్కెట్‌యార్డు
- పట్టించుకోని సంబంధిత మైనింగ్ అధికారులు

ఆదిలాబాద్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రమ ఇసుక దందా జోరుగా సాగుతుంది. ఎలాంటి అనుమతులు లేక పోయిన ఇసుక అక్రమ దందాకు అడ్డుకట్ట పడడం లేదు. పెన్‌గంగా నదిలో ఇసుక రీచ్‌లను టెండర్ ద్వారా దక్కించుకుంటున్న ఇసుక మాఫియా గుట్టుచప్పుడుకాకుండా రాత్రంతా జిల్లా కేంద్రానికి తరలించి భారీగా డంపింగ్ చేస్తున్నారు. ఆ తర్వాత పగలంతా ట్రాక్టర్లతో ఆర్డర్ల పై సరఫరా చేస్తు సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా జిల్లా కేంద్రంలోనే జరుగుతున్న పట్టించుకునే నాథుడే కనిపించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో సాత్నాల క్వాటర్స్ పరిసర ప్రాంతంలో సమీకృత మార్కెట్‌యార్డు నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్థుతం ఇక్కడ ఎలాంటి నిర్మాణం పనులు కొనసాగడం లేదు. అయిన విచ్చలవిడిగా ఇసుకను తరలిస్తూ వ్యాపారులు అమ్మేసుకుంటున్నారు. రాత్రంతా భారీ వాహనాలతో తరలిస్తూ డంప్ చేస్తున్నారు. భారీ వాహనాల శబ్దానికి భరించలేక పోతున్నామని కాలనీ వాసులు అధికారులకు పిర్యాదు చేసిన పట్టించుకోవడమే లేదని వాపోతున్నారు. వీఐపీలు విశ్రాంతి తీసుకునే పెన్‌గంగా భవన్ ముందు నుంచే నిత్యం అక్రమ ఇసుకను తరలిస్తున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదంటున్నారు. సమీకృత మార్కెట్ యార్డు నిర్మాణం పనులు పూర్తిగా నిలిచి పోవడంతో అక్రమ ఇసుకదందాతో పాటు రాత్రి వేళల్లో అసాంఘీక కార్యక్రమాలు కొనసాగుతున్న మున్సిపల్, పోలీసు అధికారులు అటు వైపు మాత్రం కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. పట్టపగలే అక్రమదందా సాగుతున్న మైనింగ్ శాఖ చూసిచూడనట్లు వ్యవహరించడం పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



జిల్లాకేంద్రంలోని సమీకృత మార్కెట్‌యార్డులో కనిపిస్తున్న ఇసుక డంపు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం బృందం

'పోకిరీలు ఇబ్బందులకు గురిచేస్తే షీ టీంను సంప్రదించాలి'

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 27: విద్యార్థినులకు షీటీం విధులు, సైబర్‌క్రైంపైన షీటీం ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం బృందం ఇన్‌చార్జీ బి.సుశీల, సత్యమోహన్లు మాట్లాడుతూ ఎవరైనా పోకిరీలు అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే షీటీంను సంప్రదించాలన్నారు. ఆకతాయిలు వేధిస్తే సెల్ నెం.8712659953 ద్వారా సంప్రదించాలని సూచించారు. ఎవరైనా డబ్బు రూపకంగా నష్టపోతే వెంటనే సైబర్ క్రైమ్ నెం.1930 కాల్ చేయాలన్నారు. మైనర్ అమ్మాయిలకు పెళ్లిళ్ల ఎక్కడైనా జరిగినట్లయితే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు లేదా 100కి కాల్ చేయాలని తెలిపారు.

నామమాత్రంగా మండల సమావేశం

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 27: ప్రతీ మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా జరిగింది. శనివారం మండలకేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పోటే శోభాబాయి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఉదయం 11.30 గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా, గంట ఆలస్యంగా ప్రారంభమైంది. 45 నిమిషాల సమయంలోనే సమావేశాన్ని మమ అనిపించారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉన్నా.. కొన్ని శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. 10 మంది ఎంపీటీసీలకు గాను ఆరుగురు హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు సైతం సమావేశంపై ఆసక్తి చూపలేదు. కేవలం సంతకాలకే పరిమితమయ్యారు. అనంతరం పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కె.భాస్కర్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంఈవో నారాయణ, ఐకేపీ ఏపీఎం రాథోడ్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రవెల్లిలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సమన్వయంతోనే అభివృద్ధి : వైస్ ఎంపీపీ

భీంపూర్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం అవుతుందని మండల సమావేశానికి అధ్యక్షతన వహించిన వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న అన్నారు. శనివారం భీంపూర్ రైతు వేదిక భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు, రైతులు, ఇతర ఉపాధిల వారికి అవసరమైన సర్టిఫికెట్‌లను అధికారుల జాప్యం లేకుండా జారీ చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో గ్రామాలలో తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తామన్నారు. మొత్తం ఆరు శాఖల మినహా ఇతర శాఖల అధికారులు రాలేదు. ప్రత్యేక అధికారులు కానరాలేదు. సమావేశం తూతూ మంత్రంగా 20 నిమిషాల్లో ముగిసింది. ఇందులో జడ్పీటీసీ సుధాకర్, ఎంపీడీ వో గోపాల కృష్ణరెడ్డి, ఏపీవో సంగీత ఎంపీటీసీలు జహూర్‌పటేల్, పుదరీ లక్ష్మీ, తూటి భోజన్న, ఆర్ఐ అశోక్, తదితరులున్నారు.



ఫ్లెక్సీ తొలగింపుపై బీజేపీ నేతల ఫిర్యాదు



ఫ్లెక్సీ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్27 : జిల్లా కేంద్రంలోని బస్‌డిపో వద్ద పూర్తి అనుమతితో ఏర్పాటు చేసిన ప్రధానిమోదీ, తదితర నాయకుల ఫ్లెక్సీ తొలగించడం పట్ల బీజేపీ శ్రేణులు శనివారం ఆర్డీవోకు ఫిర్యాదు చేశాయి. నిర్మల్ మున్సిపల్ సిబ్బంది ఉద్దేశపూర్వకంగా ఈ చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి

మహనీయుల ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ పాటుపడాలి : మాజీ మంత్రి

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 27: మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం పట్టణంలోని సుభాష్‌నగర్‌లో సారిపుత్త బుద్ధవిహార్ కమిటీ, యువ సంఘటన కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గౌతము బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామన్న మాట్లాడుతూ రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. మహనీయుల జీవిత చరిత్రలను స్ఫూర్తిగా తీసుకుని వారి బాటలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్నెల వసంత్, చంద్రశేఖర్, భగత్, అవినాశ్‌పాటిల్, వినోద్‌పరేకార్, దమ్మపాల్ జీవనే, ప్రశాంత్ తెలంగ్, లోకేష్ పాటిల్, దీపక్‌కానిండే, నాగనంద్, తెలంగ్, తదితరులు పాల్గొన్నారు.



జడ్పీటీసీ వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎన్నికల అధికారులు, పోలీసులు

ముమ్మరంగా వాహనాల తనిఖీ

తలమడుగు, ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం తలమడుగు జడ్పీటీసీ గోకగణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణలక్ష్మి రాజేశ్వర్‌ల వాహనాలను ఎన్నికల అధికారులు పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను బలోపేతం చేసేందుకు ఎలాంటి నగదు కాని మద్యంకాని పంపిణీ కాకుండా పకడ్బందీగా చర్యలు చేపడుతున్న అన్నారు. కాగా జడ్పీటీసీ వాహనాన్నితనిఖీ చేయగా వాహనంలో ఎలాంటి నగదు కాని మద్యం కాని లభ్యం కాలేదు. ఇందులో ఎన్నికల అధికారి తలమడుగు ఎస్సై సురేందర్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

జెండాలు తొలగించారంటూ..

అంతర్‌రాష్ట్ర రహదారిపై ఆందోళన

● తాంసిలో మూడు గంటల పాటు ఎక్కడి వాహనాలు అక్కడే.. ● స్తంభించిన రాకపోకలు ● రంగంలోకి దిగిన పోలీసులు



రోడ్డుపై ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు



జెండాలను తొలగించిన వారిని ప్రశ్నిస్తున్న తహసీల్దార్

తాంసి, ఏప్రిల్ 27: జెండాల తొలగింపు లొల్లి తారాస్థాయికి చేరుకుంది. ఆంజనేయ స్వామి చిత్ర పటాలతో ఉన్న కాషాయ రంగు జెండాలను తొలగించడంతో బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఆందోళనలకు దిగారు. ఎన్నికల ఆదేశాలో.. లేక స్థానిక అధికారుల ఆదేశాలో... తెలియదు గాని పారిశుధ్యం కార్మికులు ఆంజనేయ స్వామి విగ్రహం చుట్టూ ఉన్న జెండాలను తొలగించారు. దీంతో వాటిని గమనించిన బీజేపీ నాయకులు అంతరాష్ట్ర రహదారిపై పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ఈ సంఘటన శనివారం ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని పొన్నారి గ్రామంలో జరిగింది. గ్రామస్థులు అంతరాష్ట్ర రహదారి పక్కనే ఆంజనేయ స్వామి చిత్రంతో కూడిన జెండాలను చుట్టూరా కట్టారు. అయితే వాటిని పారిశుధ్య కార్మికులు తొలగించారు. దీనిని గమనించిన బీజేపీ పార్టీ నాయకులు ఎందుకు తొలగించారంటూ అంతరాష్ట్ర రహదారిపై బైఠాయించారు. దీంతో మూడు గంటల పాటు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రంగంలోకి పోలీసులు, తహసీల్దార్, వివిధ శాఖల అధికారులు వచ్చి ఆందోళనకారులను సముదాయించే ప్రయత్నం చేశారు. అయినా వారు ఎవరూ చెప్తే తొలగించారు అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ లక్ష్మీ పారిశుధ్య కార్మికులను ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు చెప్తేనే తొలగించామని పేర్కొన్నారు. క్షమాపణ చెప్పించడంతో వివాదం సద్దుమణిగింది. ఈ విషయం దావానంలా పాకడంతో యువకులు సైతం అక్కడక్కడ ఆందోళన చేసేందుకు ప్రయత్నించారు. మొత్తం మీద ఈ



అంతర్‌రాష్ట్ర రహదారిపై వాహనాలు నిలిచిపోయిన దృశ్యం

జెండాల తొలగింపు లొల్లి తీవ్ర స్థాయికి చేరుకుంది.

● ఇది ప్రభుత్వ కుట్రే : బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్‌రెడ్డి

ఇళ్లపై, ఆలయాలపైన ఉన్న ఆంజనేయ స్వామి చిత్రపటంతో ఉన్న జెండాలను తొలగించడం ఏమిటని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్‌రెడ్డి ప్రశ్నించారు. కావాలనే రేవంత్ సర్కార్ ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే సహించబోమని హెచ్చరించారు. ఇలాంటి సంఘటన పునరావృత్తం కాకుండా చూడాలని సంబంధిత శాక అధికారులను ఆయన కోరారు.

మనస్పర్ధలు పక్కన పెట్టి పనిచేయండి

● ఖానాపూర్, పెంబి మండలాల కార్యకర్తల సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



ఖానాపూర్, పెంబి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్, ఏప్రిల్ 27 : మనస్పర్ధలను పక్కన పెట్టి కుటుంబ సభ్యులాగా కలిసి పనిచేయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్ అధ్యక్షతన నిర్వహించిన ఖానాపూర్, పెంబి మండలాల ముఖ్యకార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సత్తు మల్లేష్‌తో కలిసి ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఓ సైనికుడి వలే శ్రమించాలన్నారు. ఎవరి బూత్ పరిధిలో వారు ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ వచ్చేలా పనిచేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలు అత్యంత కీలకమైనవని, నాయకులు సమన్వయంతో పని చేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్, మైనార్టీ విభాగం జిల్లా ఇన్‌చార్జి జునైద్ మెమన్, పార్టీ మండల జనరల్ సెక్రటరీ షబ్బీర్ పాషా, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మాజీ కోఆప్షన్ యూసుఫ్ ఖాన్, కౌన్సిలర్లు కుర్మ శ్రీనివాస్, కిషోర్ నాయక్, జిల్లా నాయకులు జన్నారపు శంకర్, అమానుల్లా ఖాన్, పోలంపెల్లి సచిన్, మైనార్టీ మండల అధ్యక్షుడు సలీం ఖాన్, మైనార్టీ పట్టణ అధ్యక్షుడు షౌకత్ పాషా, ఆయుబ్, మీర్జా, నేరెళ్ల సత్యనారాయణ, శేషాద్రి, తదితరులున్నారు.

నిలిపి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

● ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు ● భైంసా ఆసుపత్రికి తరలింపు

నర్సాపూర్(జి), ఏప్రిల్ 27 : మండలంలోని చాక్‌పల్లి గ్రామం సమీపంలో జాతీయ రహదారిపై నిలిపి ఉన్న లారీని కారు ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కదం దినేష్ కుమార్ నిర్మల్ సుందరం ఫైనాన్స్‌లో పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం నిర్మల్ నుంచి కారులో(టీఎస్ 18 5696)లో తిరిగి వస్తుండగా జాతీయ రహదారిపై ఎలాంటి సూచనలు పాటించకుండా రోడ్డుపై నిలిపిన లారీ వెనుక నుండి ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కదం దినేష్ కుమార్‌కు కుడిచేయి, ఏడమకాలు విరగడంతో స్థానికులు 108లో భైంసా పట్టణంలోని క్రిష్ణా ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌కు తరలించారు. ప్రమాదంలో అధికంగా రక్త స్రావమైంది. తండ్రి కదం ఆనంద్‌రావ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ సమీపంలో పోలీసులు విధులు నిర్వహిస్తున్న సమయంలో శుక్రవారం సాయంత్రం ఆరుగంటల సమయంలో డీసీఎం ఐచర్ వాహనంలో పరిమితికి మించి జనాలను ఎక్కించుకొని, ఐచర్ వాహనం ఏపీ01యూ 4918 వెనుక ఇంజిన్ తగిలించుకొని ప్రమాదకరంగా భైంసా వైపు నుండి నిర్మల్ వైపు వెళ్తున్న డ్రైవర్ దండ్ల నవీన్‌పై హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని డ్రైవింగ్ లైసెన్సు జప్తు చేసినట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు.



చాక్‌పల్లి వద్ద లారీని ఢీ కొనడంతో నుజ్జు నుజ్జు అయిన కారు

ఇంటింటికీ కాంగ్రెస్ కార్యకర్తల ప్రచారం

దస్తూరాబాద్, ఏప్రిల్ 27 : మండలంలోని మల్లాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు శనివారం ఇంటింటికి వెళ్లి ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ... ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఐదు పూర్తి చేశామన్నారు. త్వరలోనే పేదలకు ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా రైతులకు ఆగస్టు 15 లోపు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండ

పాఠశాలల మరమ్మతు పనులు వేగవంతం చేయాలి

కుంటాల, ఏప్రిల్, 27 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న మరమ్మత్తు పనులను మరింత వేగవంతం చేయాలని ఎంపీడీవో రహీం అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంఈవో ముత్యంతో పాటు పలు అధికారులతో సమావేశం నిర్వహించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా చూడాలని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



దిలావర్‌పూర్ పోలీసుస్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ

దిలావర్‌పూర్, ఏప్రిల్ 27 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తమ విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నిర్మల్ రూరల్ సీఐ బి. శ్రీనివాస్ అన్నారు. శనివారం దిలావర్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసుల పురోగతి, 100 డయల్ స్పందించే విధానంపై సమీక్షించారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో పోలీసుల పాత్ర కీలకమని సీఐ అన్నారు. ఓటర్లతో మాట్లాడే విధానం, తదితర అంశాలపై సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఎన్ని కల విధుల్లో భాగంగా తీసుకోవాల్సిన చర్యలపై ఎస్సై సుమాంజలికి సూచనలు చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి

తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్

దస్తూరాబాద్, ఏప్రిల్ 27 : పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని స్థానిక తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ అన్నారు. మండలంలోని అన్ని గ్రామల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్, టాయిలెట్స్ తదితర సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని సిబ్బంది సూచించారు. ఆయన వెంట ఆర్ఐ గంగన్న ఉన్నారు.



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్



మాన్కాపూర్‌లో పంటపొలంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

క్షణక్షణం.. భయం భయం!!

● పంట పొలాల్లో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

ఇచ్చోడ, ఏప్రిల్ 27: మండలంలోని మాన్కాపూర్ గ్రామ పరిధిలోని పంటపొలాల్లో విద్యుత్తు తీగలు కిందకు వెలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్తు తీగలు కిందకూ వేలాడుతూ రైతుల్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. చేతికి తాకే ఎత్తులో ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయందోళనకు గురవుతున్నారు. ఏన్నో నెలలుగా ఈ పరిస్థితి నెలకొన్నా.. విద్యుతుశాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే గానీ అధికారులు స్పందించారా..? అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు పొలం పనులు చేసే సమయంలో విద్యుత్తు తీగలుకిందకు వేలాడకుండా రైతులు కర్రలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు సరిచేయాలని రైతులు కోరుతున్నారు.



ఓటరు స్లిప్పులపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

గడువులోగా ఓటరు స్లిప్పులను పంపిణీ చేయాలి : తహసీల్దార్ లక్ష్మి

తాంసి, ఏప్రిల్ 27: రానున్న మే నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఓటరు స్లిప్పులను గడువు లోగా పంపిణీ చేయాలని తహసీల్దార్ లక్ష్మీ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆమె ఇంటింటికీ తిరుగుతూ ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా సంబంధిత సిబ్బంది వారి వారి విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల నియామావళికి అనుగుణంగా పనులు చేయాలని సూచించారు. ఏ ఒక్కరు తప్పు చేసిన సహించేది లేదని హెచ్చరించారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఓటరు స్లిప్పులను, పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేని వారి వివరాలను పకడ్బందీగా సర్వే చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌రెడ్డి, పలువురు అధికారులు, తదితరులు ఉన్నారు.

'రాష్ట్ర స్థాయిలో ర్యాంకు గర్వకారణం'

ఉట్నూర్, ఏప్రిల్ 27: పూర్వ విద్యార్థిని ఠాకూర్ వర్షిత రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించడం గర్వకారణంగా భావించిన మండలకేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాల యజమాన్యం శనివారం బాలికను సన్మానించింది. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో 470 మార్కులకు గాను 468 మార్కులతో రాష్ట్ర స్థాయి ఫస్ట్ ర్యాంకు సాధించిన ఠాకూర్ వర్షిత తమ పాఠశాలకు గర్వకారణం అన్నారు. ఇందులో పాఠశాల డైరెక్టర్ తుమ్మణపల్లి సత్యనారాయణ, కరస్పాండెంట్ రాము, ప్రిన్సిపాల్ సైజో సెబాస్టియన్, విద్యార్థిని తల్లిదండ్రులు ఠాకూర్ స్వప్న, ఠాకూర్ విజయ్‌సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సాలెవవాడలో దగ్ధమవుతున్న ఇళ్లు దృశ్యం

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

ఉట్నూర్, ఏప్రిల్ 27: ఉట్నూర్ మండలంలోని సాలెవాడ బి గ్రామంలో గేడంజంగుకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైందని గ్రామస్థులు తెలిపారు. శనివారం గ్రామంలో జరుగుతున్న పెళ్లికి వెళ్లిన ఇంటిల్లిపాది ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంటలు అంటుకొని దగ్ధం కావడంతో గ్రామస్థులు చల్లార్చినట్లు గ్రామపటేల్ నాగరావు తెలిపారు. ఇల్లు దగ్ధం కావడంతో ఇంట్లో ఉన్న వంట సామగ్రితో పాటు రూ.25వేల నగదు, పట్టాపాస్ పుస్తకాలు, బ్యాంకు పుస్తకాలు దగ్ధంకావడంతో రెండు లక్షల మేర నష్టంజరిగిందని ఐటీడీఏ అధికారులు పేద గిరిజన కుటుంబాన్ని ఆదుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

బోథ్, ఏప్రిల్ 27: మండల కేంద్రంలోని శబరిమాత ఆలయం వద్ద వార్షికోత్సవ కార్యక్రమం శనివారం కన్నుల పండుగగా జరిగింది. దీనిలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. పూజారి ఎడమాల ధర్మారెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం తీర్థ ప్రసాదాలను భక్తులకు అందించారు. కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

భీంపూర్, ఏప్రిల్ 27: మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన కొలిపాక అశోక్ అనే వ్యక్తికి చెందిన సెల్‌ఫోన్ 20 రోజుల క్రితం దొంగిలించబడిందని భీంపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా... వారు స్పందించి గూగుల్ లొకేషన్ యాప్ ఆధారంగా మెదక్‌లో సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. శనివారం బాధితుడికి సెల్‌ఫోన్‌ను ఎస్ఐ ప్రదీప్‌కుమార్ సిబ్బందితో కలిసి బాధితుడికి అందజేశారు. కాగా, బాధితుడు అశోక్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.





బీడీ కార్మికుల ఓట్ల కోసం పాట్లు

- బీడీ కార్మికుల సానుభూతి కోసం పార్టీల వ్యూహాలు!
- ప్రసన్నం చేసుకునేందుకు నాయకుల అగచాట్లు
- జిల్లాలోని టేకేదార్లతో మంతనాలు
- భారీగా నజారానాలకు హామీలు
- గంప గుత్త ఓట్లే లక్ష్యంగా సాగుతున్న నేతలు

నిర్మల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అత్యధికంగా ఉన్న బీడీ కార్మికుల ఓట్లపై అధికార కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు దృష్టి సారిస్తున్నాయి. జిల్లాలో దాదాపు దాదాపు లక్షకు తగ్గకుండా బీడీ కార్మికులున్నారు. వీరందరినీ ప్రసన్నం చేసుకునేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు. సాధారణంగా బీడీ కార్మికుల ఓట్లన్నీ గంపగుత్తగా పడుతుంటాయని ప్రచారం ఉంది. దీనికి అనుగుణంగానే ప్రధానపార్టీల అభ్యర్థులు బీడీ కంపెనీల టేకేదార్లతో కార్మికుల ఓట్లను కొల్లగొట్టేందుకు మంతనాలు సాగిస్తున్నారని అంటున్నారు. బీడీ కంపెనీ సెంటర్‌ల వారీగా కార్మికులకు పెద్దమొత్తంలో నజారానాలు ఇచ్చేందుకు హామీలు ఇస్తున్నారని ప్రచారం జరుగుతోంది. బీడీ కార్మికుల మెజారిటీ ఓట్లు ఎవరికి దక్కుతాయో విజయం వారినే వర్తిస్తుందని అంటున్నారు. అయితే బీడీ కార్మికుల ఓట్లను పొందేందుకు ప్రతి ఎన్నికల సమయంలో అభ్యర్థులందరు పెద్దఎత్తున ప్రయత్నాలు సాగిస్తుంటారు. ఇందులో భాగంగానే ఆయా బీడీ కంపెనీలకు సంబంధించిన టేకేదార్‌లను మొదట లోబర్చుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. టేకేదార్‌ల సహకారంతో బీడీ కార్మికులను కలిసి వారిని నజారానాలు ఇచ్చేందుకు ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే ఇలా అన్ని చోట్ల ఒప్పందాలు జరిగాయన్న ప్రచారం జరుగుతోంది. తమ పార్టీ ఓట్లతో పాటు బీడీ కార్మికుల ఓట్లను మెజార్టీగా సాధిస్తే గెలుపు సునాయసం అవుతుందని ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆశిస్తున్నారు. కాగా బీడీ కార్మికులు తాము ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారన్న నమ్మకంతోనే ప్రధాన పార్టీలన్నీ వారి మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నాయంటున్నారు. ఇక్కడి అనేక గ్రామాల్లో ఇప్పటికే ప్రధాన పార్టీలన్నీ బీడీ కార్మికులతో మంతనాలు ముమ్మరం చేశాయని చెబుతున్నారు. గత ఎన్నికలకు భిన్నంగా ఈ సారి బీడీ కార్మికులు మాత్రం ఎవరికి స్పష్టమైన హామీ ఇవ్వకుండా దాటవేత ధోరణిని అవలంభిస్తున్నారంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నేతలు తమ వద్దకు వచ్చినప్పుడు వారిని తిరస్కరించకుండా తలలు ఊపుతూనే నిర్ణయాన్ని మాత్రం స్పష్టం చేయడం లేదంటున్నారు. అయితే మూడు పార్టీలకు చెందిన అభ్యర్థుల ప్రతినిధులు చెల్లించే నజారానాలపైనే బీడీ కార్మికుల మద్దతు ఆధారపడి ఉంటుందన్న ప్రచారం కూడా జరుగుతోంది. కాగా కొంతమంది బీడీ కార్మికులు మాత్రం ఇప్పటి వరకు తమ సమస్యలు పరిష్కరించలేదంటూ అభ్యర్థుల ప్రతినిధులపై మండిపడుతున్నారంటున్నారు. గతంలో ఇచ్చిన హామీలు నెరవేరలేదని, ఆ హామీలు నెరవేర్చిన తరువాతనే తమ వద్దకు రావాలంటూ స్పష్టం చేస్తున్నారని పేర్కొంటున్నారు. దీంతో బీడీ కార్మికులను మచ్చిక చేసుకునేందుకు పార్టీలు తంటాలు పడుతున్నాయని చెబుతున్నారు. మధ్యవర్తులుగా టేకేదార్లను రంగంలోకి దించి వారిని తమవైపుకు తిప్పుకునే ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్న వాదనలున్నాయి.

సమన్వయకర్తలుగా టేకేదార్‌లు

జిల్లావ్యాప్తంగా దాదాపు దాదాపు లక్షకు పైగా పీఎఫ్ బీడీ కార్మికులున్నారు. అయితే పీఎఫ్, నాన్ పీఎఫ్ బీడీ కార్మికులు ప్రతీ కంపెనీలో ఉండడంతో ఆ కంపెనీలకు సంబంధించిన టేకేదార్‌లను పార్టీలు రంగంలోకి దించుతున్నాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే టేకేదార్‌లతో మొదటిదశ చర్చలు జరిపినట్లు ప్రచారం జరుగుతోంది. వీరితో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఆత్మీయ సమ్మేళనం పేరిట సమావేశాలను నిర్వహించి వారందరికీ విందులు, బహుమానాలు కూడా అందించినట్లు చెబుతున్నారు. టేకేదార్‌లతో ఎలాగైనా బీడీ కార్మికులను ఒప్పించి వారి ఓట్లను పొందేందుకు ఆయా పార్టీలు ముమ్మరంగా ప్రయత్నాలు సాగిస్తున్నా యి. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు గెలిస్తే వస్తే బీడీ కార్మికుల పెన్షన్‌లను రద్దు చేస్తాయంటూ కూడా బీఆర్ ఎస్ పార్టీ ప్రచారం సాగిస్తోందని అంటున్నారు. అలాగే బీడీ కార్మికులపెన్షన్‌లను కూడా పెంచుతామని ఆయా పార్టీలు హామీలు ఇస్తున్నాయి. కాగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీడీ కార్మికులకు అన్యాయం చేసిందని కాంగ్రెస్, బీజేపీ పార్టీలు విమర్శిస్తున్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే కార్మికులకు జీవనభృతితో పాటు కనీస వేతనం అమలు చేస్తామని, పని దినాల పెంపుపై చర్యలు తీసుకుంటామంటూ కాంగ్రెస్, బీజేపీ పార్టీ లు చెబుతున్నాయి. బీడీ కార్మికుల ఉపాధికి భరోసా కల్పించే జీఓ నం బర్ 41ను ఎలాగైనా అమలు చేసేందుకు కృషి చేస్తామంటూ ఈ పార్టీలు భరోసా కల్పిస్తున్నాయి.


బీడీ కార్మికులను ఓట్లు అడుగుతున్న బీఆర్ఎస్ నాయకులు

ప్రతీ ఎన్నికల్లో వారే కీలకం

కాగా గ్రామస్థాయి నుంచి మొదలుకొని అసెంబ్లీ, లోక్‌సభ స్థాయిలో జరిగే ప్రతి ఎన్నికల్లోనూ జిల్లాలో బీడీ కార్మికులు కీలక పాత్ర పోషిస్తుంటారు. మొదటి నుంచి వారు సెంటిమెంట్‌గా కొన్ని పార్టీలను ఆదరిస్తున్నారు. మొదట్లో తెలుగుదేశం ఆ తరువాత కాంగ్రెస్ దానితో పాటు బీఆర్ఎస్ పార్టీలను ఆదరించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో వారంతా మెజార్టీగా బీజేపీ పార్టీకి మద్దతునివ్వడంతో నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో ఆ పార్టీ విజయం సాధించగలిగిందని అంటున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికల తరువాత మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో బీడీ కార్మికులు తమ వైఖరిని మార్చుకునే అవకాశం ఉందని అన్ని పార్టీలు భావిస్తున్నాయి. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ప్రాధాన్యతలు వేరు వేరుగా ఉంటాయని దీని కారణంగా అప్పటి ప్రభావం ఈ ఎన్నికలపై ఉండకపోవచ్చని భావిస్తున్నారు. మొత్తానికి బీడీ కార్మికుల మద్దతు ఏ పార్టీకి ఉంటుందో ఆ పార్టీ విజయం సాధించడం ఖాయమన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ఓటు వినియోగంపై ట్రాన్స్‌జెండర్లకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 27 : ఓటు హక్కు వినియోగంపై శనివారం ట్రాన్స్ జెండర్లకు మహిళా శిశు సంక్షేమశాఖ, స్వీప్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఆర్డీవో విజయలక్ష్మి మాట్లాడుతూ... ఓటు హక్కు లేని వారు ఓటు నమోదు చేసుకుని ఓటు వేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి నాగమణి, ట్రాన్స్ జెండర్లు పాల్గొన్నారు.

కుంటాలలో ఓటరు స్లిప్పుల పంపిణీ


కుంటాలలో ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కుంటాల, ఏప్రిల్, 27 : మండల కేంద్రం కుంటాలలో శనివారం త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఓటర్లకు అంగన్వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ.. ఓటుహక్కు ఎంతో విలువైనదని. ప్రతీ ఒక్కరు ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు.

జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 27 : జిల్లా కేంద్రం కొండాపూర్ పార్టీ కార్యాలయంలో శనివారం బీఆర్ఎస్ శ్రేణులు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. జడ్పీ చైర్‌పర్సన్ కే.విజయలక్ష్మి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా పుట్టి.. కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రాన్ని సాధించిందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా పార్టీ ఉంటుందన్నారు. మాజీ డీసీసీబీ చైర్మన్ రాంకిషన్ రెడ్డి, నాయకులు భూషణ్ రెడ్డి, లక్ష్మణాచారి పాల్గొన్నారు.


ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 27 : పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో నిర్మల్ నియోజకవర్గంలోని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రచార జోరుగా పెంచింది. శనివారం అభ్యర్థి సుగుణను గెలిపించాలని కోరుతూ గంజాల్, జాఫ్రాపూర్ గ్రామాల్లో మహిళా కాంగ్రెస్ నాయకులు అల్లూరి కృష్ణవేణి, లక్ష్మి, వాసవి ప్రచారం నిర్వహించారు. మండల పార్టీ నాయకులు రాజనర్సింహారెడ్డి, మోహినుద్దీన్, ఫక్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు. మరోవైపు తల్వేద, లంగ్డాపూర్ గ్రామాల్లో అల్లూరి మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు ఎంబరి గంగాధర్ ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలను కలుసుకొని పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. అలిశెట్టి శ్రీనివాస్, బక్కన్న, రేగుంట గంగాధర్, తదితరులు పాల్గొని చేతు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు.

గోదావరిఖనిలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్

- నాలుగు రోజుల పాటు నిర్వహణ
- పాల్గొన్న ఆదిలాబాద్ జట్టు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 27: రాష్ట్ర స్థాయి సీనియర్ ఇంటర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో శనివారం ప్రారంభమైంది. స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కరీంనగర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన ఈ టోర్నమెంట్ నాలుగు రోజుల పాటు జరుగనున్నది. ఈ టోర్నమెంట్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొనున్నాయి. 10వ సీనియర్ ఇంటర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ చాంపియన్‌షిప్‌ను సింగరేణి ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, క్రీడలు శరీర దారుఢ్యాన్ని పెంచడంతో పాటు దారుఢ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడాకారులకు సింగరేణి వసతి సౌకర్యం కల్పించింది. తొలిరోజు జరిగిన మ్యాచ్‌ల్లో నిజామాబాద్, వరంగల్ జట్లు తొలి మ్యాచ్‌లో పోటీ పడగా నిజామాబాద్ జట్టు విజయం సాధించింది. రెండవ మ్యాచ్‌లో వనపర్తి, ఖమ్మం జట్ల మధ్య జరిగిన పోటీల్లో వనపర్తి జట్టు విజయం సాధించింది. మూడవ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జట్ల మధ్య మ్యాచ్ జరుగగా డ్రాగా ముగిసింది. 5వ మ్యాచ్ రంగారెడ్డి, మెదక్ జట్లు మధ్య జరిగిన మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టు విజయం సాధించింది. 6వ మ్యాచ్‌లో వరంగల్, కరీంనగర్ జట్లు తలపడగా కరీంనగర్ జట్టు విజయం సాధించింది. 7వ మ్యాచ్ నల్గొండ, ఖమ్మం జట్ల మధ్య జరిగిన పోటీల్లో నల్గొండ జట్టు గెలుపొందింది. ఈ టోర్నమెంట్‌లో కరీంనగర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గణపతి, వైస్ ప్రెసిడెంట్ ఆర్పి నాయుడు, కోశాధికారి సామాల సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ విజయ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్‌తో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలి

- సాధారణ పరిశీలకుడు రాజేంద్ర విజయ్


మాట్లాడుతున్న సాధారణ పరిశీలకుడు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 27 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సాధారణ పరిశీలకుడు రాజేంద్ర విజయ్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ జానకి షర్మిల పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు సూచనలు చేస్తూ పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఓటర్ల వివరాలు, ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు తదితర చర్యలను అడిగి తెలుసుకున్నారు. గాజులపేటలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యాలు పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బం దులు కలుగకుండా చూడాలని, ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ జానకి షర్మిల, ఆర్డీవో రత్నకల్యాణి, తదితర అధికారులు పాల్గొన్నారు. భైంసా ఏఎస్పీ కార్యాలయంలో పోలీసు పరిశీలకుడు రాజేష్ కుమార్, కలెక్టర్, ఎస్పీ, ఏఎస్పీలతో సమీక్ష జరిపారు.


స్ట్రాంగ్ రూమ్ పరిశీలిస్తున్న అధికారులు

ముథోల్‌లోనూ పరిశీలించిన ఎన్నికల అబ్జర్వర్లు

ముథోల్ : పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ముథోల్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఈవీ ఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను శనివారం జనరల్ అబ్జర్వర్ రాజేంద్ర విజయ్, పోలీసు అబ్జర్వర్ రాజేష్ కుమార్ సక్సేనాలు పరిశీలిం చారు. ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు, విధులు, తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పలు సలహా, సూచనలు ఇచ్చారు. వీరి వెంట కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్, ఎస్పీ జానకిషర్మిల, ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ విఠల్, సీఐ మల్లేష్, ఎస్సై సాయి కిరణ్, ఆర్ఐ నారాయణ, తదితరులున్నారు.


ముథోల్‌లో ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్లు

కస్తూర్బా కళాశాల విద్యార్థినులను అభినందించిన కలెక్టర్

లక్ష్మణచాంద, ఏప్రిల్ 27 : మండలంలోని కస్తూరిబా కళాశాలలో టాపర్స్‌గా నిలిచిన రక్షిత, అర్షియా, అక్షిత (సెకండ్ ఇయర్), రాధిక, శైలజ, అశ్విని (ఫస్ట్ ఇయర్) తదితర విద్యార్థులను, కళాశాల సిబ్బందిని నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శనివారం అభినందించారు. ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్‌లో 93.06 శాతంతోను, ఫస్ట్ ఇయర్‌లో 88.42 శాతంతోను ఉత్తీర్ణత సాధించటం ద్వారా రాష్ట్రంలోని కస్తూర్బా పాఠశాలల్లో నిర్మల్ జిల్లా టాపర్‌గా నిలవటం కోసం భాగస్వామ్యం వహించిన కళాశాలలు, విద్యార్థులను ప్రత్యేకంగా ప్రశంసించారు. భవిష్యత్‌లో మరింత ప్రతిభ సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, ప్రత్యేక అధికారిణి నవిత, తదితరులు ఉన్నారు.


కస్తూర్బా కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కేజీబీవీ ఫలితాల పట్ల కలెక్టర్ సంతృప్తి

నిర్మల్ కల్చరల్ : కేజీబీవీ ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లా మొదటిస్థానంలో నిలిచినందున కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అభినందించారు. మొదటిర్యాంకు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాను మొదటిస్థానంలో నిలపడం పట్ల ఎంతో కృషి ఉందని కొనియాడారు. క్రమశిక్షణ, అంకితభావంతో చదివి ఉన్నత ఫలితాలు సాధించడం హర్షనీయమన్నారు. సిబ్బందిని అభినందిస్తూ భవిష్యత్‌లో మరిన్ని మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, డీఈవో రవీందర్‌రెడ్డి, కేజీబీవీ కళాశాలల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో రేపు మెగా ఉద్యోగ మేళా

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 27 : నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం 9 గంటలకు మెగా ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భీమ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. జియో, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీల్లో బ్రాంచ్ రిలేషన్ షిప్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ మార్కెటింగ్ భాగాల్లో ఉద్యోగాలకు డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ఈ అవకాశం ఉపయోగించుకోవాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా అంబేద్కర్ జయంతి


అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, గ్రామస్థులు

కుంటాల, ఏప్రిల్, 27 : మండలంలోని వెంకూర్ గ్రామంలో శనివారం అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరు ఆయన ఆశయసాధనకు కృషి చేయాలని మగ్గిడి శృతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మగ్గిడి దిగంబర్‌తో పాటు గ్రామస్థులు ఉన్నారు.

బోల్సాలో రాస్తారోకో


సముదాయిస్తున్న ఎస్సై సందీప్

తానూర్, ఏప్రిల్ 27 : మండలంలోని బోల్సా గ్రామంలో శనివారం దళిత సంఘాల ఆధ్వర్యంలో భైంసా-తానూర్ రహదారిపై రాస్తారోకో నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్ర వారం నిర్వహించిన అంబేద్కర్ జయంతి శోభాయాత్రలో భాగంగా అదే గ్రామానికి చెందని కొందరు యువకులు నినాదాలు చేయగా, ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించిన దళిత మహిళలపై దాడికి పాల్పడ్డారని దీంతో శోభాయాత్ర ఆపేసి పోలీసులకు సమా చారం అందించిన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రాస్తారోకో చేపట్టినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్సై లోకం సందీప్ అక్కడికి చేరుకొని సముదాయించినప్పటికి ధర్నా విరమించక పోవడంతో ముధోల్ సీఐ మల్లేష్ అక్కడికి చేరుకొని బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామి ఇవ్వ డంతో రాస్తారోకో విరమింప జేశారు.

నేడు ఎమ్మార్పీఎస్ బహిరంగ సభ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 27 : ఎమ్మార్పీఎస్ బహిరంగ సభ ఆదివారం సాయంత్రం 6 గంటలకు రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా నాయకులు గంధం గంగాధర్, బొబ్బిలి శ్రీనివాస్, శనిగారపు రవి మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండ లాలకు చెందిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, విద్యార్థులు, యువకులు హాజరు కావాలని కోరారు.